క్లుప్తంగా

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి


సబ్బెళ్ల కృష్ణారెడ్డి

అనపర్తి: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు వ్యవసాయ మార్కెట్ కమిటీ నిధులు రూ.40 లక్షలు మంజూరైనట్టు ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ప్రాంగణం కాంపౌండ్ వాల్, మరుగుదొడ్ల నిర్మాణం, బోర్ వేసేందుకు రూ.15.50 లక్షలు, బిక్కవోలు మండలం కొంకుదురులో మార్కెట్ కమిటీ నిధులతో నిర్మించిన మార్కెట్ షెట్లకు ప్రహరీ నిర్మాణానికి రూ.25 లక్షలు నిధులు వెచ్చించేందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరైనట్టు ఆయన తెలిపారు. ఆయా నిర్మాణాలకు సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తయిన అనంతరం పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ అభివృద్ధి పనులకు సంబంధించి అనుమతులు మంజూరుకు సహకరించి కృషి చేసిన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఏపీ అసెంబ్లీ స్పీకర్ ఓఎస్‌డీ పడాల సత్యనారాయణరెడ్డి, ఏపీ మార్కెట్‌శాఖ అధికారులకు కృష్ణారెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎంపీపీపై దాడి దారుణం

సీతానగరం: కాకినాడ జిల్లా రౌతులపూడి మండలానికి చెందిన మండల అధ్యక్షురాలు, ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన విజయలక్ష్మిపై దాడికి పాల్పడిన గిరిజన నేతలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, కఠినంగా శిక్షించాలని జిల్లా ఎంపీపీ సంఘం అధ్యక్షురాలు గుర్రాల జ్యోత్స్న అన్నారు. ఆమె గురువారం విలేకరులతో మాట్లాడుతూ విజయలక్ష్మి రౌతులపూడి ఎంపీపీగా ఉంటూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారన్నారు. ఆమెను పీహెచ్‌సీ ప్రారంభోత్సవానికి ఆహ్వానించకపోగా, ప్రశ్నించిన ఆమెపై దాడికి పాల్పడటం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

సీతానగరం: ముగ్గళ్ల, మిర్తిపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ వార్షిక మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ చంద్రమోహన్ తెలిపారు. ఉండేశ్వరపురం, మిర్తిపాడు, బొబ్బిల్లంక, ములకల్లంక, కాటవరం, మునికూడలి, రాజంపేట, వెదుళ్లపల్లి, జాలిమూడి, ఇనుగంటివారిపేట, ముగ్గళ్ల, రఘుదేవపురం, చినకొండేపూడి, సింగవరం పంచాయతీ నాగరత్నం కాలనీ, సీతానగరం గ్రామాలతో పాటు కోరుకొండ మండలం మధురపూడి వ్యవసాయ మోటార్లకు అంతరాయం కలుగుతుందన్నారు.

27న నన్నయలో వర్క్‌షాప్


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: ఏపీ ఉన్నత విద్యా ప్రణాళికా బోర్డు, ఇంటర్ ఇనిస్టిట్యూషనల్ రీజినల్ క్లస్టర్ ఆఫ్ గోదావరి డిస్ట్రిక్స్ సహకారంతో ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఈనెల 27న డేటా ఎనలిటిక్స్‌పై వర్క్‌షాప్ జరగనుంది. ఈ కార్యక్రమ బ్రోచర్‌ను గురువారం వీసీ ఆచార్య కె.పద్మరాజు విడుదల చేశారు. కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ డిపార్టుమెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో ఈ వర్క్‌షాప్ నిర్వహిస్తారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఆచార్య పి.సురేష్ వర్మ, డాక్టర్ బి.కెజియారాణి, ఆచార్య కేఎస్ రమేష్, ఆచార్య డి.జ్యోతిర్మయి, డాక్టర్ పి.వి జయనిర్మల పాల్గొన్నారు.

ఆణిముత్యాలు.. విద్యాకుసుమాలు

- చదువులో ప్రతిభ చూపిన విద్యార్థులకు పురస్కారాలు
- ప్రదానం చేసిన ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, డాక్టర్ సూర్యనారాయణరెడ్డి


దివాన్ చెరువులో పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా


పురస్కారం ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

రాజానగరం: చదువులో ప్రతిభ చూపిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను జగనన్న ఆణిముత్యాలు పురస్కారాలతో సత్కరించడం అభినందనీయమని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచ్చిన నియోజకవర్గంలోని విద్యార్థులకు దివాన్‌చెరువు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం నగదు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా, నియోజకవర్గం, మండల, పాఠశాల స్థాయిలో మొదటి మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఈ విధంగా ప్రోత్సహించడం హర్షణీయమన్నారు. దీనిద్వారా విద్యార్థులలో పోటీతత్వం పెరుగుతుందని, తద్వారా ప్రతిభ వెలుగులోకి వస్తుందన్నారు. విద్యాపరంగా కూడా సరైన అభివృద్ధిని సాధిస్తేనే రాష్ట్ర ప్రగతి కూడా మరింత ముందంజ వేస్తుందనే ఉద్దేశంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నారన్నారు. ప్రతి ఇంటా ఒక డాక్టర్, ఒక ఇంజినీర్, ఒక సీఈఓ, ఒక ఐఏఎస్, ఐపీఎస్, వంటి ఉన్నత స్థాయి అధికారి, ఒక మంచి ప్రజాప్రతినిధి తయారుకావాలనేదే ఆయన అభిమతమన్నారు. ఇందుకోసం అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక, విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాలకు కోట్లాది రూపాయాలు వెచ్చిస్తూ, భవితకు భరోసానిస్తున్నారన్నారు.

విద్యారంగానికి స్వర్ణయుగం

ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వమూ విద్యారంగానికి ఇంతటి ప్రాధాన్యతనివ్వలేదన్నారు. నేడు ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారన్నారు. జగనన్న పాలన విద్యారంగానికి స్వర్ణయుగమన్నారు. ప్రతి విద్యార్థి ఈ విషయాన్ని గ్రహించి, ప్రభుత్వ ఇస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని, తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలన్నారు. కార్యక్రమంలో రాజానగరం, కోరుకొండ ఎంఈఓలు ఎం.రామన్నదొర, టి.కుశలవదొర, జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, కో కన్వీనర్ గండి నానిబాబు, మాజీ కన్వీనర్ మందారపు వీర్రాజు, నాయకులు గంగిశెట్టి సోమేశ్వరరావు, వేమగిరి కృష్ణ, బొరుసు బద్రి, వాకా నరసింహరావు, పలివెల స్వామి, మార్గాని శ్రీను, వై.ధర్మరాజు, గ్రంధి నానబ్బులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థ బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం

అనపర్తి: విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగంలో అనేక మార్పులు తీసుకొస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. 2022–2023 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన ప్రతిభ చూపిన విద్యార్థులను సత్కరించే జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. నియోజకవర్గ స్థాయిలో స్థానిక తేతలి రామిరెడ్డి మంగాయమ్మ కళావేదిక ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి విచ్చేసిన విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులతో కార్యక్రమం వేడుకగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో విద్యారంగం అభివృద్ధి సాధించిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో ప్రాథమిక స్థాయి నుంచే విద్యాప్రమాణాలు పెంపొందించడంతోపాటు నాణ్యమైన విద్యను అందించే దిశగా ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని అన్నారు. నాడు–నేడులో పాఠశాలల అభివృద్ధి, ఆర్థిక ఇబ్బందులతో ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదన్న లక్ష్యంతో అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెనతోపాటు జగనన్న గోరుముద్ద వంటి పథకాలను ప్రవేశపెట్టి నిర్ణీత సమయంలో వాటిని అమలు చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ భరోసాతో సర్కారు పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులకు దీటుగా రాణిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించడంతో పాటు మిగిలిన విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందిచేందుకు ప్రభుత్వం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జెడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మి వెంకటరెడ్డి, ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, ఎంఈఓ కె.స్వామినాయక్, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ సత్తి రామకృష్ణారెడ్డి, పార్టీ నాయకులు రొంగల అప్పాజీ తదితరులు మాట్లాడారు. అనంతరం జగనన్న ఆణిముత్యాల పేరిట పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో నియోజకవర్గ స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన 1, 2, 3 స్థానాల్లో నిలిచిన విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించి విద్యార్థులకు నగదు, మెడల్, ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో అనపర్తి, పెదపూడి ఎంపీపీలు అంసూరి సూర్యనారాయణ, కేతా తులసి శ్రీనివాస్, సర్పంచి వారా కుమారి, రాష్ట్ర భట్రాజుల కార్పొరేషన్ డైరెక్టర్ షణ్ముఖి చిట్టిరాజు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, వైస్ ఎంపీపీ కర్రి దాసు, ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి, పార్టీ నాయకులు రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, గుత్తుల వెంకటరమణ, పడాల వెంకటరెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రభుత్వ కానుకలు


రంగంపేట హైస్కూల్లో విద్యార్థులకు జగనన్న కిట్లు అందజేస్తున్న జెడ్పీటీసీ రాంబాబు

రంగంపేట: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు జగనన్న విద్యా కానుకలు ఓ వరం లాంటివని జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో హెచ్‌ఎం వి.పార్థసారథి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను అందజేశారు. అనంతరం జగనన్న ఆణిముత్యాలు పేరిట ప్రభుత్వం ప్రకటించిన ప్రతి పాఠశాల నుంచి 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించి ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు రూ.3 వేలు, ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థులకు రూ. 2 వేలు, తృతీయ స్థానం సాధించి విద్యార్థులకు వెయ్యి రూపాయలు చొప్పున పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి పాలాటి నాగేశ్వరరావు, విద్యా కమిటీ చైర్మన్ తిరుపతి శ్రీనివాస్, ఎంపీటీసీ సూర్యకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మోదీ ప్రజారంజక పాలన


మాట్లాడుతున్న బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్

మధురపూడి: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రజారంజక పాలన సాగుతోందని బీజేపీ జాతీయ కార్యదర్శి వై.సత్యకుమార్ అన్నారు. కోరుకొండ మండలం నర్సాపురంలో గురువారం కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. రాజానగరం అసెంబ్లీ కన్వీనర్ ఏపీఆర్ చౌదరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథి సత్యకుమార్ మాట్లాడుతూ మోదీ తొమ్మిదేళ్ల పాలనలో పేదల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేశారన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, రాష్ట్ర నాయకులు పరిమి రాధాకృష్ణ, క్షత్రియ బాల సుబ్రహ్మణ్యసింగ్ తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం పంచాయతి లంకూరుకు చెందిన కోరిమిల్లి పట్టాభి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్సై సమర్పణరావు గురువారం తెలిపారు. లంకూరులో బుధవారం రాత్రి జరిగిన ఇరువర్గాల ఘర్షణలో ఇద్దరు వ్యక్తులు తనపై రాళ్లతో దాడి చేశారని ఆయన ఫిర్యాదు చేశారన్నారు.

ఖరీఫ్ సాగుపై రైతులకు సలహాలివ్వండి


సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ మణిదీప్

పెదపూడి: ఖరీఫ్ పనులపై రైతులు సలహాలు, సూచనలు ఇవ్వాలని ఏఓ టీవీఆర్ మణిదీప్ గ్రామ వ్యవసాయ సహాయకులు సూచించారు. జి.మామిడాడ గ్రామంలోని స్థానిక రైతు భరోసా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకులు సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. మణిదీప్ మాట్లాడుతూ మొదటిగా మట్టి నమునా పరీక్షలపై అవగాహన కల్పించారు. మండలంలో 570 మట్టి నమునా పరీక్షలు చేశారన్నారు. మట్టి నమునా పరీక్షలు ఏ విధంగా సేకరించాలి, సేకరించిన తర్వాత దాని వివరాలు మొబైల్ యాప్‌లో ఏలా అప్‌లోడు చేయాలి, క్షేత్రస్థాయిలో ఏమి చేయాలో అవగాహన కల్పించారు. ప్రస్తుత తొలకరి పంట నారు మడులు త్వరితగతిన చేసేలా రైతులకు అవగాహన కల్పిస్తూ నారుమడి వేసే ముందు విత్తన శుద్ధి తప్పని సరిగా చేయాలని అవగాహన కల్పించాలన్నారు. పీఎం కిసాన్ పథకంలో కేంద్రం ప్రభుత్వం అందజేస్తున్న పెట్టుబడి సహాయం సంవత్సరానికి రూ.6వేల రావడానికి తప్పని సరిగా రైతుల నుంచి బయోమెట్రిక్ తీసుకోవాలన్నారు. ఈ విషయం గ్రామ స్థాయిలో రైతులకు తెలియజేయాలన్నారు. కౌలు రైతులకు కార్డులు అందించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

మైనార్టీల పక్షపాతి సీఎం జగన్


తొర్రేడులో మాట్లాడుతున్న మహ్మద్ ఆరీఫ్

రాజమహేంద్రవరం రూరల్: మైనార్టీల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ముస్లింలు రుణపడి ఉంటారని జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ మహమ్మద్ ఆరీఫ్ అన్నారు. హర్ దిల్ మే వైఎస్ఆర్ – హమ్ సబ్ జగన్‌కే సాత్ కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, పార్టీ మైనారిటీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఖాదర్ బాషా ఆదేశాల మేరకు గురువారం ఆయన నేతృత్వంలో తొర్రేడు, వెంకటనగరం, కొంతమూరు, మల్లయ్యపేట శాంతినగర్ మసీదులను సందర్శించారు. మస్జిద్ కమిటీ సభ్యులు, స్థానిక ముస్లింలతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరీఫ్ మాట్లాడుతూ ఉర్దూకు రెండో అధికార భాష హోదా కల్పించడంతో పాటు, గతంలో రూ.ఎనిమిది వేలు ఉన్న మసీదు ఇమాం, మౌజన్‌ల జీతాలను రూ.15 వేలకు పెంచి పెద్ద మనసును చాటుకున్నారన్నారు. వక్ఫ్ భూములను సంరక్షించడంతో పాటు కర్నూల్‌లో వక్ఫ్ ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేసి వక్ఫ్‌ఆస్తుల రక్షణకు చేసిన ముందస్తు చర్యలను ముస్లిం మైనారిటీలు హర్షిస్తున్నారన్నారు. అనంతరం స్థానిక మసీదుల వద్ద నెలకొన్న సమస్యలను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్లు షబ్బర్ బాషా, మహ్మద్ జఫ్రూలా ఖాన్, షేక్ అహ్మద్ పాల్గొన్నారు.

మలేరియా రహిత సమాజమే లక్ష్యం

సీతానగరం: మలేరియా రహిత సమాజానికి ప్రజలందరూ కృషి చేయాలని పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు అన్నారు. శుక్రవారం సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రాజు, సిబ్బంది, ఏఏన్‌ఎంలు గ్రామంలో పర్యటించారు. ఇళ్లు, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. దోమలు నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని, తద్వారా ప్రాణాంతకమైన మలేరియా వ్యాధిని నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రాధాకృష్ణ, ఎంపీహెచ్‌ఎస్ కె.సుధాకర్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం

ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్‌ప్రసాద్



గోకవరం: మండలంలోని తిరుమలాయపాలెంలో ఎస్సీలపై దాడి సంఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్‌ప్రసాద్ అన్నారు. గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు విషయంలో తలెత్తిన వివాదం నేపథ్యంలో గురువారం ఆయన పర్యటించారు. గాయపడిన బోయిడి మహాలక్ష్మి తదితరులను పరామర్శించారు. బాధితుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసిన స్థలాన్ని పరిశీలించి కోరుకొండ సీఐ ఉమామహేశ్వరరావు, తహశీల్దార్ ఎ.శ్రీనివాస్‌లతో మాట్లాడారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇది చాలా విచారకరమైన సంఘటన అన్నారు. బాధితులను చట్టపరంగా ఆదుకోవడానికి చర్యలు తీసుకుంటామన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆరేళ్ల బాలికపై అత్యాచారం

రాజానగరం: అభం శుభం తెలియని ఆరేళ్ల బాలికపై ఓ కామాంధుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. తీవ్ర రక్తస్రావంతో ఉన్న ఆ బాలికను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. స్థానిక జంగాలకాలనీలో గురువారం సాయంత్రం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలావున్నాయి. ద్వారపూడికి చెందిన షేక్ మీరావలీ (38) పైకాలనీలోని అత్తారింటికి వచ్చి నివాసం ఉంటున్నాడు. భార్య, ఇద్దరు పిల్లలతో తాళాలు బాగుచేస్తూ జీవనం గడుపుతున్న అతడి దృష్టి పక్కింటిలోనే నివాసం ఉంటున్న ఓ నిరుపేద కుటుంబానికి చెందిన ఇద్దరు చిన్నారులపై పడింది. తల్లిదండ్రులు కూలి పనికి వెళ్లడంతో ఆరుబయట ఆడుకుంటున్న 8, 6 సంవత్సరాల వయసున్న అక్కాచెల్లెళ్లకు అన్నం పెడతానని ఆశ పెట్టి తన ఇంటిలోకి తీసుకువెళ్లాడు. అక్కపై అత్యాచారానికి ప్రయత్నించడంతో ఆ బాలిక భయపడి బయటకు పారిపోయింది. ఆరేళ్ల బాలికను పారిపోకుండా పట్టుకుని, బలవంతంగా తన కామవాంఛను తీర్చుకున్నాడు. దీనితో ఆ చిన్నారి తీవ్ర రక్తస్రావంతో బిగ్గరగా ఏడుస్తుండటంతో ఇరుగు పొరుగు వెళ్లి చూస్తే జరిగిన దారుణం బయటపడింది. వెంటనే ఆ చిన్నారిని చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దీనిపై స్థానిక సీఐ కాశీవిశ్వనాథ్‌ను ప్రశ్నించగా జరిగిన సంఘటన వాస్తవమేనని, అయితే బాలిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నందున పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేస్తామన్నారు.

అంగన్‌వాడీల ధర్నా

మధురపూడి: కోరుకొండ ఐసీడీఎస్ పీఓ కార్యాలయం వద్ద గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ధర్నా చేశారు. సంస్థాగతమైన సమస్యలు పరిష్కరించాలని, జీతాలు పెంచాలని కోరుతూ పీఓ ఝాన్సీరాణికి వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు అన్నపూర్ణ, కోరుకొండ ప్రాజెక్టు అధ్యక్షురాలు మాలతి, కార్యదర్శి సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.